# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 21-09-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- దేవాలయాల పవిత్రతను కాపాడేందుకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.
- రాబోయే దీపావళి నుంచి 3 ఉచిత సిలిండర్లు పంపిణీ కార్యక్రమం చేపడుతున్నామని శాసన సభాపతి చింతకాయల అయ్యన్న పాత్రుడు వెల్లడించారు.
- ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసం భారత పరిశ్రమల సమాఖ్య (CII)తో కలిసి రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు.
- మహాకవి గురజాడ వెంకట అప్పారావు 162వ జయంతి వేడుకలు ఈరోజు విజయనగరంలో ఘనంగా నిర్వహించారు.
- ఇండియా ఏఐ మిషన్ రూపకల్పనకు భారత ప్రభుత్వం 10,372 కోట్ల రూపాయలు కేటాయించిందని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటి మంత్రిత్వ శాఖ కార్యదర్శి ఎస్. కృష్ణన్ తెలిపారు.

=======================

దేవాలయాల పవిత్రతను కాపాడేందుకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. ఈరోజు మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో సందర్శకుల నుంచి ఆయన వినతులు స్వీకరించారు. ఈ సందర్బంగా పాత్రికేయులతో మాట్లాడుతూ... రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే తిరుమలను ప్రక్షాళన చేయాలని అధికారులకు స్పష్టం చేసామని తెలిపారు. అన్ని దేవాలయాల్లో ప్రసాదాల నాణ్యాతా పరీక్షలు, అవసరమైన సంప్రోక్షణ కార్యక్రమాలు చేపడతామని ముఖ్యమంత్రి తెలిపారు. విజయవాడతో సహా పలు ప్రాంతాల్లో వరద బాధితులకు వేగంగా సాయం అందేలా చూస్తున్నామని... మానవీయ కోణంలో సాయం అందిస్తున్నామని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు.

======================

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసం భారత పరిశ్రమల సమాఖ్య (CII)తో కలిసి రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. వ్యవసాయ ఆధారిత ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు రాష్ట్రంలో అపార అవకాశాలు ఉన్నాయన్నారు. సులభతర వాణిజ్యంపై ప్రభుత్వం దృష్టి పెడుతుందని, ఐటీ, డేటా సెంటర్‌లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్ (ఏఐ) లాంటి సాంకేతికతల కేంద్రంగా విశాఖను తీర్చిదిద్దుతామన్నారు. రానున్న 5 సంవత్సరాల్లో 20 లక్షల మందికి ఉద్యోగాలు కల్పిస్తామని మంత్రి తెలియజేస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

======================

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న "ఇది మంచి ప్రభుత్వం" కార్యక్రమంలో భాగంగా అనకాపల్లి జిల్లా గొలుగొండ మండలం ఎల్లవరం గ్రామంలో శాసన సభాపతి చింతకాయల అయ్యన్న పాత్రుడు పాల్గొని ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో మాట్లాడుతూ.. నూతన ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత ఏ కార్యక్రమం చేపట్టాలన్నా కొంత సమయం పడుతుందని అన్నారు. రాబోయే దీపావళి నుంచి 3 ఉచిత సిలిండర్లు పంపిణీ కార్యక్రమం చేబడుతున్నామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో పంచాయతీలకు అవసరమైన నిధులివ్వలేదని.. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ప్రతీ పంచాయతీకి నిధులు మంజూరు చేశారని తెలియజేశారు. ప్రభుత్వం ఏర్పడిన ఈ వంద రోజుల్లో ఎల్లవరం గ్రామానికి 2.81 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేశామని అన్నారు. రానున్న 5 సంవత్సరాల్లో నియోజకవర్గాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని అయ్యన్నపాత్రుడు తెలిపారు.

======================

మహాకవి గురజాడ వెంకట అప్పారావు 162వ జయంతి వేడుకలు ఈరోజు విజయనగరంలో ఘనంగా నిర్వహించారు. తొలుత గురజాడ స్వగృహం వద్ద జరిగిన కార్యక్రమంలో గురజాడ చిత్రపటం వద్ద రాష్ట్ర సూక్ష్మ చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ జ్యోతి వెలిగించి నివాళులర్పించారు. అనంతరం మంత్రి శ్రీనివాస్‌తో పాటు విజయనగరం శాసనసభ్యురాలు అదితి గజపతిరాజు, ఎం.ఎల్.సి. పి.సురేష్‌బాబు, కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్, సంయుక్త కలెక్టర్ ఎస్.సేతు మాధవన్, గురజాడ కుటుంబ సభ్యులు, సాహితీ సంస్థల ప్రముఖులు, కళాకారులు, జిల్లా అధికారులు పాల్గొని గురజాడ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కలెక్టరేట్ ఆడిటోరియంలో జరిగిన జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న మంత్రి కొండపల్లి మాట్లాడుతూ.. మహాకవి గురజాడ వెంకట అప్పారావు జీవితాన్ని పాఠ్యాంశంగా చేర్చి, ఆయన గొప్పదనాన్ని నేటి తరానికి తెలియజేయాలని కోరారు. గొప్ప సామాజిక స్పృహతో రచనలు చేసిన గురజాడ పేరుతో "స్ఫూర్తి" అవార్డును ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లాకు గురజాడ ఎంతో పేరు తెచ్చారని, ఆయన కవితను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సైతం ప్రస్తావించారని గుర్తు చేశారు.

విరామం

======================

రానున్న 3 సంవత్సరాల్లో భారతదేశాన్ని కృత్రిమ మేధస్సుకు ఒక ముఖ్య కేంద్రంగా నిలిపేందుకు కృషి చేస్తున్నామని భారత ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్, ఐటి శాఖ కార్యదర్శి ఎస్. కృష్ణన్ తెలిపారు. ఒకరోజు పర్యటనలో భాగంగా ఆయన విశాఖలోని మెడ్ టెక్ జోన్ లో పర్యటించిన అనంతరం ఈరోజు ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని నాస్కామ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ లో ఏయూ, నేవెల్ డాక్ యార్డ్, షిప్ యార్డ్ వంటి సంస్థల ప్రతినిధులతో సమావేశమయ్యారు. అనంతరం కృష్ణన్ పాత్రికేయులతో మాట్లాడుతూ... దేశంలో ఎలక్ట్రానిక్స్, ఐటి సెక్టార్ కలిపి 400 బిలియన్ డాలర్ల టర్నోవర్ వుందని, 2030 నాటికి దానిని ఒక ట్రిలియన్ డాలర్ కు తీసుకు వెళ్లడమే తమ లక్ష్యమని తెలిపారు. అందులో భాగంగా సెమీకండక్టర్స్ ముఖ్య భూమిక

ఘోషించబోతున్నాయన్నారు. ఇండియా ఏఐ మిషన్ రూపకల్పనకు  భారత ప్రభుత్వం 10 వేల 372 కోట్ల రూపాయలు కేటాయించిందని వెల్లడిస్తూ...

(వాయిస్ 24 సెకన్లు)

=======================

రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు పూర్తయిన సందర్భంగా పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులోని పూలపల్లి నుంచి భగ్గేశ్వరం వరకు 100 అడుగుల ఆకు పచ్చ జండాతో రైతులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ... గత ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టుతో పాటు అన్ని జలాశయాలు, కాలువలు, డ్రైన్లను పట్టించుకోకపోవడం వరద ముంపుకు కారణమైందన్నారు. ఎన్డీయే ప్రభుత్వం ఇన్ పుట్ సబ్సిడీని ఒక హెక్టార్ కు 25 వేల రూపాయలకు పెంచి ఇస్తున్న మంచి ప్రభుత్వమన్నారు. గత ప్రభుత్వం రైతులకు చెల్లించాల్సిన 1,640 కోట్ల రూపాయల ధ్యాన్యం బకాయిలను కూటమి ప్రభుత్వం చెల్లించిందన్నారు.

=======================

తీర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఇన్ కాయిస్ శాస్త్రవేత్త చంద్రశేఖర్ అన్నారు. అంతర్జాతీయ తీర ప్రాంత పరిశుభ్రతా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈరోజు ప్రకాశం జిల్లా కొత్తపట్నం తీర ప్రాంతంలో ఇన్ కాయిస్, మత్స్యశాఖ, ఎన్.సి.సి., ఎన్.ఎస్.ఎస్., మెరైన్ పోలీసు, మత్స్యకారులు, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తీర ప్రాంతాన్ని శుభ్రం చేసే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ, ఇన్ కాయిస్ ద్వారా మత్స్యకారులకు ఎంతో విలువైన సమాచారం అందజేస్తున్నామన్నారు. తీర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్.సి.సి. అధికారి పీతాంబర్ శ్రేష్ట్ మాట్లాడుతూ, నీటిని పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మనకు వచ్చే ఎన్నో రోగాలకు కలుషిత నీరే కారణమని, అందుకే తీరప్రాంతంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.

=======================

ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని సెప్టెంబరు 27వ తేదీన ఘనంగా నిర్వహించాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ అన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవ నిర్వహణపై ఈరోజు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమీక్షించారు. పర్యావరణ హితంగా, పర్యాటక, సాంస్కృతిక, సాంప్రదాయాలు ఉట్టిపడేలా వేడుకలు ఉండాలని సవర కళాకండాలు ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. ఫూడ్ ఫెస్టివల్ నిర్వహించి అందులో నాణ్యమైన ఆహారం అందించాలని అన్నారు. ఆడాలి వ్యూ పాయింట్ ను ఉదయం 10 గంటలకు ప్రారంభించడం జరుగుతుందని, మధ్యాహ్నం 3 గంటలకు ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్కులో ప్రపంచ పర్యాటక ఉత్సవాలు నిర్వహించడం జరుగుతుందని, సభతో పాటు వివిధ స్టాళ్లను ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.

=======================

అంబేద్కర్ కోనసీమ జిల్లా సరిహద్దు యానాం పరిసర ప్రాంతాల్లోని దరియాలతిప్ప వద్ద ఓఎన్జిసి గ్యాస్ పైప్ లైన్ లీక్ అయిందంటూ.. సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారమవుతున్న వీడియో జూలై నెలలో తీసిందని ఓఎన్జిసి అధికారులు తెలియజేశారని అమలాపురం రెవిన్యూ డివిజనల్ అధికారి జి.కేశవ వర్ధన్ రెడ్డి ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సంవత్సరం జూలై 29వ తేదీన దరియాలతిప్ప వద్ద గ్యాస్ పైప్ లైన్ లీక్ అవ్వడం ఓఎన్జిసి అధికారులు గుర్తించారని.. సంబంధిత పైప్ ని డీ.ప్రెజరైజ్ చేసి ఐసోలేట్ చేశారని.. ప్రస్తుతం ఆ పైపు ద్వారా ఎటువంటి గ్యాస్ లీక్ అవడం లేదని ఆర్డీవో స్పష్టం చేశారు.

=======================
=======================